

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చిన్నకోడూరులో డిమాండ్ చేస్తున్న రైతులు

## కాల్వ ధ్వంసంచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- బెల్లంకుంట రైతుల ఆందోళన

చిన్నకోడూరు, మార్చి 26: కాల్వ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బెల్లంకుంట రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం చిన్నకోడూరులో రైతులు మాట్లాడుతూ బెల్లంకుంట చెరువు కింద దాదాపు 200మంది రైతుల భూములు ఉన్నాయన్నారు. సాగుకు నీరు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డామని, మా బాధను మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా స్వంత డబ్బులతో ఇరిగేషన్ అధికారుల ద్వారా కాల్వ తవ్వించారన్నారు. పైపులు వేసి పక్షం రోజుల క్రితం సాగునీరు విడుదల చేశారని తెలిపారు. మంగళవారం రాత్రి కొంతమంది కాల్వ పైపులను బండరాళ్లతో మూసివేసి నీరు వృథాకాకుండా ఆపుకునే సంచులను ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు, కలెక్టర్ స్పందించి బెల్లంకుంట నిండే విధంగా సాగునీరు అందించి, కాల్వను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, గడ్డమీద రాజేశం, జంగిటి ఆనందం, ఏదుల అశోక్ రెడ్డి, ఏదుల శ్రీనివాసరెడ్డి, కుందేళ్ల దశరథం, జంగిటి శ్రీనివాస్, గోపాల్ గోపయ్య, శేఖర్, ఇట్టబోయిన బాలపోసి, ఇట్టబోయిన కనకయ్య, శంకర్, రాజు, వికాస్, శ్రీశైలం, రాజు ఉన్నారు.

## విధుల నుంచి వైద్యాధికారి తొలగింపు

- మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు
- నిర్లక్ష్యానికి చర్యలు తప్పవని హెచ్చరించిన సంగారెడ్డి కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 26: విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారిని తొలగించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాతా, శిశు సంరక్షణపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న ఒక వైద్యాధికారిని విధుల నుంచి తొలగిస్తూ మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. జహీరాబాద్ ఏరియా దవాఖానలో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అజ్మనాజ్ దవాఖానకు వచ్చే గర్భిణులను ప్రైవేటు దవాఖానలకు రెఫర్ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో డాక్టర్ అజ్మనాజ్‌ను విధుల నుంచి తొలగించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవిని కలెక్టర్ ఆదేశించారు. దౌల్తాబాద్, మల్చెల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు అందజేయాలని ఆదేశించారు.

### 50శాతం తగ్గిన మాతా, శిశు మరణాలు

జిల్లాలో 2023–24 సంవత్సరంతో పోల్చితే 2024–25లో మాతా, శిశు మరణాలు 50శాతం తగ్గినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి వెల్లడించారు. ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రిస్క్ కేసులకు ఏరియా దవాఖానలో వైద్యం అందించేలా చూడాలన్నారు. హైరిస్క్ కేసుల్లో రెఫర్ చేస్తున్నప్పుడు వైద్యులు సమన్వయంతో సహకారం అందించుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు క్రమం తప్పకుండా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి వారికి తగిన సూచనలు, సలహాలు తెలియజేయాలని సూచించారు. పౌష్టికాహారం, మందులు వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, వివిధ ప్రభుత్వ దవాఖానల వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పంచాయతీ ఉద్యోగి ఆత్మహత్య



కుమార్ (ఫైల్)

అల్లాదుర్గం, మార్చి 26: పంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబీకులు, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన బోయిని కుమార్(28) కొన్నేండ్లుగా అల్లాదుర్గం పంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతోఈ నెల 21న అర్ధరాత్రి తన నివాసంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో చేరాడు. దీంతో కుటుంబ సభ్యులు జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు, అటునుంచి హైదరాబాద్ ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి సోదరుడు బోయిని పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


నమస్తే తెలంగాణ

మెదక్

I హైదరాబాద్, గురువారం 27 మార్చి 2025 MEDAK


## గ్రామాలను చేర్యాల పీఎస్‌కు మార్చాలి



అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 26: చేర్యాల ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మరోసారి అసెంబ్లీలో ప్రస్తావించారు. చేర్యాల మండలంలోని నాగపురి, శభాష్‌గూడెం, వేచరేణి, పెదరాజుపేట గ్రామాలకు చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చాలన్నారు. వాస్తవంగా నాలుగు గ్రామాల ప్రజలు నిత్యం రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర ప్రభుత్వ శాఖల అధికారుల కోసం చేర్యాలకు వస్తుంటారన్నారు. పోలీస్‌స్టేషన్ సమస్యలపై మాత్రం ఆ గ్రామాల ప్రజలు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తున్నదని, వెంటనే ఆ గ్రామాలను చేర్యాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. మద్దూరు మండలం నుంచి చేర్యాల మండలానికి అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాలను ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడి చేర్యాలకు బదిలీ చేయించారు. నిత్యం చేర్యాల ప్రాంత సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గళమెత్తుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచనల మేరకు నాలుగు గ్రామాలను చేర్యాల పీఎస్‌కు మారుస్తామని మంత్రి శ్రీధర్‌బాబు జవాబు ఇచ్చారు.



సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో నీటి ట్యాంకర్లలో నీటిని నింపుతున్న వ్యాపారులు



సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో నీటి ట్యాంకర్లతో దందా

# జోరుగా నీటి దందా

## మళ్లీ రోడ్లపైకి నీటి ట్యాంకర్లు.. చతికిలపడిన ప్రభుత్వ నీటి సరఫరా వ్యవస్థ

- వట్టిపోతున్న బోర్లు
- తగ్గిపోతున్న భూగర్భ జలాలు
- ట్యాంకర్లతో నీటిని కొంటున్న ప్రజలు
- పరిశ్రమల్లో నిరంతర డిమాండ్
- వాణిజ్య సముదాయాల్లోనూ ట్యాంకర్లతో నీటి కొనుగోలు
- నీటి దందాకు నాయకుల వెన్నుదన్ను
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు



సంగారెడ్డి జిల్ల చిట్కుల్‌లో నీటి ట్యాంకర్లతో దందా

### అక్రమ బోర్లను సీజ్ చేస్తాం..

సంగారెడ్డి జిల్లాలో నీటి వ్యాపారం చేసే బోర్లను గుర్తిస్తాం. అనుమతులు లేని బోర్ల లిస్టును తయారు చేస్తున్నాం. స్పెషల్ డ్రైవ్ చేపట్టి బోర్లను సీజ్ చేయడంతోపాటు వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు పెడతాం. పటాన్‌చెరు ప్రాంతం ఇప్పుడు సెమీ సేఫ్‌జోన్‌లో ఉంది. వేసవిలో చర్యలు తీసుకోకుంటే రెడ్‌జోన్‌లోకి వెళ్తుంది. బోర్లతో నీటిని తోడటంపై నిఘా పెడుతున్నాం. భూగర్భ జలాలు రెడ్‌జోన్‌లో రాకుండా చర్యలు తీసుకుంటాం. మండలాల వారీగా భూగర్భ జలాల శాతం లిస్టు తయారైంది.

– జి.నర్సింహులు, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్

పటాన్‌చెరు, మార్చి 26: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో నీటి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్నది. ఈ ప్రాంతంలో వారానికి ఒకసారి కూడా సరిగ్గా నీరు సరఫరా కాకపోవడంతో నీటి ఎద్దడి నెలకొంది. దీనిని వ్యాపారంగా మార్చుకొని ట్యాంకర్ల ద్వారా నీటి దందా సాగిస్తూ కొందరు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, హాస్టళ్లకు నిత్యం పదుల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీల్లో, అపార్టుమెంట్లలో బోర్లు ఎండిపోతుండడంతో ట్యాంకర్లే దిక్కుగా మారాయి. పటాన్‌చెరు పారిశ్రామికవాడ సమీపంలోని గ్రామాల్లో భూగర్భజలాలు కలుషితం కావడంతో వాటిని ఎవరూ వాడడం లేదు. పరిశ్రమలు సైతం ఆ నీటిని ఉపయోగించడం లేదు. ఈ నేపథ్యంలో కలుషితం కాని బోర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతున్నది. పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో ఏ ధరనైనా పెట్టి నీటి ట్యాంకర్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే నల్లా నీరు రాకపోవడంతోపాటు, బోర్లు ఎండిపోయి మధ్య, పేద తరగతి వర్గాలు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనడం తలకుమించిన భారంగా మారుతున్నది. నీటి ట్యాంకర్లకు డిమాండ్ పసిగట్టిన కొందరు నాయకులు, వ్యాపారులు బాగా నీటిని పోస్తున్న బోర్లను గుర్తించి రైతుల వద్ద లీజుకు తీసుకొని దందా సాగిస్తున్నారు. వేసవిలో నీటి సరఫరాకు డిమాండ్ ఉంటుందని గ్రహించే నాయకులు, వ్యాపారులు లోపాయికారిగా నీటి సరఫరా చేసే వ్యవస్థలను నాశనం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు నీరందకుండా చూడడంతోనే నీటి ట్యాంకర్లకు భారీ డిమాండ్ ఏర్పడి వారు చెప్పిందే రేటుగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి.

### వారంలో ఒకరోజు మాత్రమే నీటి సరఫరా

పటాన్‌చెరు నియోజకవర్గానికి మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు, జలమండలి, మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా పట్టణాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథలో గ్రిడ్ మెయిన్ లైన్ల నుంచి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇంట్రా ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ నీటి సరఫరా కొనసాగుతున్నది. ఇప్పుడు ఇంట్రాను తప్పించి ఆ బాధ్యతలను పంచాయతీలకు ప్రభుత్వం అప్పగించింది. రింగు రోడ్డు లోపల ఉన్న పట్టణాలు, గ్రామాలకు జలమండలి ద్వారా తాగునీరు అందజేస్తున్నారు. మున్సిపాలిటీల్లోని నీటి సరఫరా విభాగం ఇంటింటికీ నీరందేలా చర్యలు తీసుకుంటుంది. ఇప్పుడు వేసవిలో పైపులు పగలడం, రోడ్డు విస్తరణ పనుల కారణంగా పైపులకు మరమ్మతులు తలెత్తుతుండడంతో చాలా గ్రామాల్లో వారంలో ఒక రోజు మాత్రమే నీరు సరఫరా అవుతున్నది. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందని ద్రాక్షగా మారుతున్నది. ఇప్పటికే అధికశాతం బోర్లు ఎండిపోయాయి. భూగర్భజలాలు అడుగంటి గృహాల్లోని బోర్ల నుంచి నీరు రావడం లేదు. ఇది వ్యాపారులకు వరంలా మారింది. ట్రాక్టర్ ట్యాంకర్లు, లారీ ట్యాంకర్లు, పెద్ద లారీ ట్యాంకర్లతో నీటిని అమ్ముతున్నారు. ఫోన్ చేసి వ్యాపారులను బతిమాలితే నీటిని పంపుతున్నారు.

### పరిశ్రమల్లో విపరీతమైన డిమాండ్



రుద్రారంలో పరిశ్రమకు నీటిని తీసుకెళ్తున్న ట్యాంకర్

నియోజకవర్గంలోని పటాన్‌చెరు, బొల్లారం, బొంతపల్లి, గడ్డపోతారం, పాశమైలారం, కాజీపల్లి, రుద్రారంలలో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ఉన్నాయి. ఫార్మా, కెమికల్, బల్క్‌డ్రగ్ పరిశ్రమలకు నిరంతరం సురక్షితమైన నీరు అవసరం. నీటిని ఏడాదంతా సరఫరా చేసేందుకు స్థానిక నాయకులు, వ్యాపారులు కాంట్రాక్టు పొందారు. ఆరునూరైనా ఒప్పుకున్న సంఖ్యలో నీటి ట్యాంకర్లను రోజూ పంపాల్సి ఉంటుంది. వేసవిలో ట్యాంకర్లకు రెట్టింపు డిమాండ్ ఏర్పడుతుంది. పరిశ్రమలకు నీటిని అందజేసేందుకు వ్యాపారులు రైతుల వ్యవసాయ బోర్లను సైతం లీజుకు తీసుకుంటున్నారు. అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేట్, సుల్తాన్‌పూర్, బొల్లారం, కాజీపల్లి, ముత్తంగి, కర్ధనూర్, నందిగామ, క్యాసారం, ఇస్నాపూర్, చిట్కుల్, రుద్రారంలలో అక్రమంగా నీటిని తోడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాల్లో, హోటళ్లలో, హాస్టళ్లలో నీటికి బాగా డిమాండ్ ఏర్పడింది. వీరికి కూడా సకాలంలో నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు గృహాల్లో, అపార్టుమెంట్లలో, గేటెడ్ కమ్యూనిటీల్లో, పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో బోర్లు ఎండిపోయి నీటికి డిమాండ్ ఏర్పడడంతో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే 50శాతం ధరలు వ్యాపారులు పెంచినట్లు సమాచారం. ఇప్పుడు ఈ రేట్లు ఉంటే ఏప్రిల్, మేలో ధరలు ఎంత వసూలు చేస్తారోనని ప్రజలు భయపడుతున్నారు. భూగర్భ జలశాఖ ఎన్‌వోసీ ఉన్నా వ్యాపారులు మాత్రమే నీటి దందా చేయాల్సి ఉంటుంది. అనుమతులు పొందినవారు వేళ్లమీద లెక్కించవచ్చు. అక్రమ నీటి తోడకంపై అధికారుల నియంత్రణ కరువై నీటి ట్యాంకర్ల దందా పుంజుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటి సరఫరా వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ట్యాంకర్లతో నీటిని కొనే పరిస్థితి ఏ రోజూ రాలేదని, ఇప్పుడు మళ్లీ నీటిని కొంటున్నామని ప్రజల వాపోతున్నారు. అధికారులు నీటి వ్యాపారంపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బోరుమంటున్న దుబ్బాక రైతు

## తలాపున మల్లన్నసాగర్ ఉన్నా ఎండుతున్న పంటలు

- ఏ ఊరిలో చూసినా వందలాది బోరుబావుల తవ్వకం
- 90శాతం బోర్లు ఫెయిల్
- ఎండిన చెరువులు, కుంటలు
- బోసిపోయిన కూడవెల్లి వాగు
- పశువులకు మేతగా మారిన వరిపంట



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేటలో ఎండిన వరిపంట

దుబ్బాక, మార్చి 26: వందలాది చెరువులు, కూడవెల్లి వాగు, మల్లన్నసాగర్ రిజర్వాయర్ ఉన్నప్పటికీ నీళ్లులేక దుబ్బాక ప్రాంతంలో యాసంగి వరిపంట ఎండిపోతున్నది. దీంతో రైతులు బోర్లు తవ్విస్తున్నారు. ఎన్నిబోర్లు తవ్వించినా చుక్కనీరు రావడం లేదు. అటు పంట ఎండిపోవడం, ఇటు బోర్ల తవ్వకానికి అప్పులు కావడంతో రైతులు దిగులు చెందుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు, కూడవెల్లి వాగు మండుటెండల్లో సైతం జలకళ ఉట్టిపడి పంటలు పండాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగు భూములు సైతం బీడు బారుతున్నాయి. చెరువులు,కుంటల్లో నీరులేక ఎడారిని తలపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీరందక చేతికొచ్చే సమయంలో వరి పంటలు ఎండిపోతున్నాయి. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లి వాగులోకి సకాలంలో సాగునీరు విడుదల చేయలేదు. దీంతోపాటు 4ఎల్ డిస్ట్రిబ్యూటర్ కాల్వల నిర్మాణం పూర్తికాక పోవడంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. నీరందక ఎండిన వరి పొలాలను రైతులు పశువులకు మేతకు వదిలేస్తున్నారు. ఏ పొలం చూసినా నెర్రెలిడి కనిపిస్తున్నాయి. దుబ్బాక మండలం రామక్కపేట, రఘోత్తంపల్లి గ్రామాల్లో బుధవారం 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్ చేసింది. నీరులేక పొట్టదశకు వచ్చిన వరి పంటలు ఎండిపోతుండడం కనిపించింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేసి బోర్లు తవ్విస్తున్నా చుక్కనీరు రావడం లేదు. ఈ రెండు గ్రామాల్లో నెల రోజుల్లో 200 బోరుబావులు తవ్వించినట్లు తెలిసింది. వీటిలో 90శాతం బోరుబావుల్లో చుక్కనీరు పడలేదు. చెరువులు నీరులేక బోసిపోయాయి. గతేడాది యాసంగితో పోల్చితే ఈసారి తక్కువ విస్తీర్ణంలో వరి సాగుచేసినప్పటికీ నీరందక పంటలు ఎండిపోతున్నాయి. దుబ్బాక మండలం ఆకారం సెక్టార్‌లో ఈ యాసంగిలో 3140 ఎకరాల వరి పంట సాగు చేయగా, ఇందులో 40శాతం పంట ఎండిపోయింది.

### పంట మొత్తం ఎండిపోయింది

ఐదెకరాలకు రెండెకరాల్లో వరి పంట వేశాను. నీళ్లు లేక, కరెంట్ సరిగ్గా రాక వేసిన పంట మొత్తం ఎండిపోయింది. మల్లన్నసాగర్ నుంచి మా గ్రామానికి కాల్వల ద్వారా నీళ్లు వస్తాయని ఎంతో ఆశతో రైతులమంతా ఎదురుచూశాం. కాల్వ నిర్మాణం చేయకపోవడంతో సాగునీటి సమస్య నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పంట కాపాడకునేందుకు రూ.1.50 లక్షలు అప్పు చేసి, రెండు బోరు బావులు తవ్వించిన. చుక్క నీరు పడలేదు. పొట్ట దశలో ఉన్న వరిపంటకు నీరు లేకపోవడంతో మొత్తం ఎండిపోయింది.

– బిట్ల యాదగిరి, రైతు, రామక్కపేట (సిద్దిపేట జిల్లా)



దుబ్బాక మండలం రామక్కపేటలో చుక్కనీరు లేని పెద్దచెరువు (రామ చెరువు)

### గింతగోస ఎప్పుడూ చూడలేదు..



మా రఘోత్తంపల్లిలో పెద్దచెరువు పక్కనే నాకు ఐదెకరాల భూమి ఉంది. గతంలో 5 ఎకరాల్లో పంట వేసేటోడిని. ఈసారి కొంత సందేహంతో యాసంగిలో నాలుగెకరాల్లో వరి పంట వేశాను. మార్చి మొదటి వారంలోనే చెరువులో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. దీంతో సాగునీరు అందక వేసిన పంట ఎండిపోయింది. ఇప్పటికే సగానికి పైగా పంట ఎండిపోయింది. బోరు సరిగా పోస్తలేదు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పుడు పంటకు నీరు చాలా అవసరం. ఉన్న పంటను బతికించుకునేందుకు నీళ్ల ట్యాంకర్లు కూడా దొరకడం లేదు. నేను ఎప్పుడు నీళ్ల కోసం గింత గోస పడలేదు. కేసీఆర్ ఉన్నప్పుడు మల్లన్న సాగర్ నుంచి కూడవెల్లి వాగుకు, కాల్వలకు నీరు వదిలితే చెరువు, కుంటలు నిండి రెండు పంటలు మంచిగా పండినయి. ఇప్పుడు అంత తికమక అయ్యింది. – నల్ల రాజిరెడ్డి, రైతు, రఘోత్తంపల్లి (సిద్దిపేట జిల్లా)



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాలలో దేవాదుల కాల్వ దుస్థితి

## కాంగ్రెసొచ్చింది.. కాల్వ మూసుకుపోయింది

- దేవాదుల నీటికి దేవుడే దిక్కు
- చేర్యాల ప్రాంతంలో వేలాది ఎకరాల్లో ఎండిపోతున్న పంటలు

చేర్యాల, మార్చి 26: కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు విడుదల చేయకపోవడంతో సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతంలో దేవాదుల కాల్వలు చెత్తాచెదారం, ముళ్లపొదలతో మూసుకుపోయాయి. అసలే దుర్భిక్ష ప్రాంతం.. దీనికితోడు నీటి ఇబ్బందులతో యాసంగిలో వేసిన వరి పంటలు ఎండిపోతుండడంతో రైతులు బోర్లమీద బోర్లు తవ్విస్తున్నారు. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి,ఐనాపూర్ గ్రామాల మధ్య రిజర్వాయర్ నిర్మించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో పదేండ్ల పాటు దేవాదుల నుంచి నీటిని లిఫ్ట్ చేసి రిజర్వాయర్ నింపి అక్కడ నుంచి కాల్వల ద్వారా చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపడంతో భూగర్భజలాలు పెరిగి బోరుబావుల నుంచి పుష్కలంగా నీరు వచ్చి పంటలు దిగుబడి పెరిగింది. కాంగ్రెస్ వచ్చాక దేవాదుల నుంచి నీళ్లు లిఫ్ట్ చేయకపోవడంతో తపాస్‌పల్లి రిజర్వాయర్ అడుగంటి పోవడంతో ఈ ప్రాంతంలో భూగర్భజలాలు తగ్గిపోయి రైతుల బోర్లనుంచి చుక్కనీరు రాకపోవడంతో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో సుమారు 1500 ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. రిజర్వాయర్లు నింపి రైతుల పంటలు కాపాడాలని అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానీ, తపాస్‌పల్లికి చుక్క నీరు రానివ్వడం లేదు.

### ఎండిన చెరువు

చేర్యాల మండలంలోని ముస్త్యాలలోని జక్కల, తాళ్ల చెరువు ఏటా గోదావరి జలాలతో నింపడంతో గ్రామంలో కరువు కనిపించకుండా పోయింది. కాంగ్రెస్ వచ్చాక ఈ చెరువుకు చుక్క నీరు రాలేదు. దీంతో గ్రామంలోని బోర్లు వట్టిపోయాయి. ఒక్కో రైతు రెండు మూడు బోర్లు వేయించినా ఫలితం లేకుండా పోయింది. ముస్త్యాల్య గ్రామానికి చెందిన తరిగొప్పుల అంజయ్య అనే రైతు కుటుంబానికి నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పదేండ్లలో బోరు నుంచి పుష్కలంగా నీళ్లు వచ్చి పంటలు మంచిగా పండాయి. పదేండ్ల నుంచి మంచిగా నీరుపోసిన బోరు ఈసారి ఎండిపోవడంతో పంటలు కాపాడుకునేందుకు మరోరెండు బోర్లు అప్పు చేసి రైతు అంజయ్య తవ్వించాడు. అందులో ఒక్క బోరు నుంచి దుబ్బ తప్ప ఏమి లేదు. మరో బోరు నుంచి కొద్దిపాటిగా నీళ్లు వస్తుండడంతో దానిని వేలాది రూపాయలు ఖర్చు చేసి బోరు మోటర్ ఫిటింగ్ చేశారు. నాలుగున్నర ఎకరాల్లో ఏకరంన్నర పంట ఎండిపోగా మిగిలిన మూడు ఎకరాలను కాపాడుకునేందుకు ముప్పుతిప్పలు పడుతున్నాడు. ప్రతి పంటకు 300 బస్తాలుకు పైగా వడ్లను విక్రయించుకునే రైతు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ముస్త్యాలలో ఎండిపోయిన వరి పంట